నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 11, 2025 | www.navatelangana.com

వాగుపై అడ్డంగా పోసిన మట్టి కట్టలు తొలగించాలని వినతి



నవతెలంగాణ-బోథ్

సొనాల మండలం చింతలబోరి గొల్లపూర్ చెరువుల నుండి వాగుల ద్వారా వచ్చే నీటిని దిగువకు రాకుండా పెద్ద పెద్ద మట్టి కట్టలు వేస్తున్నారని సోమవారం సొనాల మండల కేంద్రలో రైతులు తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెద్దవాగుపై మట్టి కట్టలు వేయడం ద్వారా కిందకు నీరు రాక పంటలు ఎండిపోతున్నాయన్నారు. భూగర్భజలాలు లోతులోకి వెళ్లిపోతున్నాయని, పశువులకు తాగడానికి నీరు లేకుండా పోతోందని, వెంటనే వాగులో మట్టి కట్టలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ రెండో రోజులలో సమస్య పరిష్కారమిస్తామని హామీ ఇచ్చారు.

గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-భైంసా



గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పేండ్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. వార్డుల్లో పర్యటించారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీచేశారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను విని విద్యార్థులతో సమాధానాలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు హాజరుపట్టికను పరిశీలించారు. అక్కడి నుంచి అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట డీఎల్పీఓ సుదర్శన్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోజంహుస్సేన్, ఏపీఓ శివలింగం. కార్యదర్శి కవిత ఉన్నారు.

ఎండీఎంకు పెరిగిన ధరలు వర్తింపజేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెరిగిన ధరలను వర్తింపజేస్తూ బడ్జెట్ పెంచాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి జిల్లా విద్యాధికారి గమినియల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెరిగిన మెనూ చార్జీ 74 పైసలు చెల్లించాలన్నారు. 10 వ తరగతి విద్యార్థులకు పెడుతున్న స్నాక్స్ ఒక్కో విద్యార్థికి యూనిట్ ఖర్చు 20 చెల్లించాలన్నారు. మెనూ చార్జీలు 74 పైసలు డిసెంబరు నెల నుండీ చెల్లించాల్సిందిపోయి ఇంతవరకు చెల్లించకపోవడం కేవలం ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యమేనని అన్నారు. జిల్లాకు రెగ్యులర్ విద్యాధికారి లేకపోవడం మూలాన కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులు వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల క్షేమం కోరడం ఉత్తమాటేనని ఇలాగే కొనసాగితే ప్రస్తుత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టడం ఖాయమని ఎద్దేవా చేశారు. స్నాక్స్ కోసం రూ.15 కేటాయించడం దారుణమని, దాన్ని వెంటనే రూ.20 పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ లింగాపూర్ మండల అధ్యక్షురాలు కోడ్పే భీంబాయి పాల్గొన్నారు.

మైనారిటీ శాఖకు రెగ్యులర్ అధికారిని కేటాయించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మైనార్టీ సంక్షేమ శాఖకు రెగ్యులర్ జిల్లా అధికారిని కేటాయించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు కోరారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికి మూడు శాఖలు ఉండడంతో విద్యార్థులకు సరైన న్యాయం జరగడంలేదన్నారు. పని భారం ఎక్కువ కావడంతో పర్యవేక్షణ కరువైందని తెలిపారు. వెంటనే స్పందించి రెగ్యులర్ ప్రాతిపదికన అధికారిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయిక్రిష్ణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టికానంద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వసాకె సాయి కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సాయిక్రిష్ణ, నాయకులు పవన్ పాల్గొన్నారు.

జైనూర్ కార్యదర్శి, ఎంపీఓపై ఫిర్యాదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైనూరు మండల కేంద్రానికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, మండల పంచాయతీ అధికారి మోహన్‌పై ఆదివాసీ పంచాయతీ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడావి మనోహర్ గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం పూర్తిగా ఆదివాసీ చట్టానికి లోబడి ఉండాల్సి ఉండగా పంచాయతీ కార్యదర్శి ఎంపీవోలు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తూ ఆదివాసి చట్టాలను తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో 1/70చట్టం, పెసా చట్టాలు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని కోరినప్పటికీ సరైన సమాచారం ఇవ్వకుండా చట్ట నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నారు. వీటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను కలెక్టరేట్ లో సమర్పించినట్లు వివరించారు. వెంటనే వారు ఇరువురిపై చర్యలు తీసుకొని ఆదివాసులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు షేకు, భగవంతురావు, సోనేరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ మల్లేష్‌కు సన్మానం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని తహసీల్దార్ మల్లేష్‌ను సోమవారం మండల కేంద్రానికి చెందిన నాయకులు సన్మానించారు. నూతనంగా ఏర్పాటైన మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు నల్ల శ్రీధర్‌రెడ్డి, రాంరెడ్డి, సాయి పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని బిజెపి నూతన అధ్యక్షుడు ధోని శ్రీశైలం అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు సుంకరి పెంటయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే పార్టీ బలోపేతం అయిందని, మరింత అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించే దిశగా శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్నాక విజయ్, వెంకన్న, సుదర్శన్‌గౌడ్, ఆంజనేయగౌడ్, సొల్లు లక్ష్మి, జయరాజ్ పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

- లారీ, ఇతర వాహనాలు సీజ్
- 36 టన్నుల బియ్యం పట్టివేత
- నిర్మల్ ఎస్పీ డా.జానకి షర్మిల



నవతెలంగాణ-భైంసా

మహారాష్ట్రలోని ధర్మాబాద్ కేంద్రంగా నడుస్తున్న రేషన్ బియ్యం రాకెట్‌ను జిల్లా పోలీసులు గుట్టురట్టు చేశారు. సోమవారం పట్టణంలోని ఎస్పీ క్యాంపు ఆఫీస్‌లో ఎస్పీ జానకి షర్మిల విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 8న రాత్రి భైంసాలోని శివాజీ చౌక్‌లో ఓ కారును 16 టైర్ల లారీ ఢీ కొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు లారీ డ్రైవర్‌ను విచారించగా పొంతలేని సమాధానం ఇవ్వడంతో అనుమానం వచ్చిన పోలీసులు లారీని తనిఖీ చేశారు. అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి ఎస్పీకి సమాచారం అందించారు. వెంటనే భైంసా, నిర్మల్ ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనాను బృందాలుగా ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీలో ఉన్న 36 టన్నుల బియ్యాన్ని సీజ్ చేసి జిల్లా పౌరసరఫరాల శాఖకు అప్పగించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన అబ్దుల్ రవుఫ్ అనే వ్యక్తి ఈ రేషన్ బియ్యం రాకెట్ దందా నడుపుతున్నట్లు గుర్తించారు. ఆ తర్వాత 3న బాసర మండలంలో రహదారిపై మహారాష్ట్ర బార్డర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటా మ్యాజిక్ వాహనంలో రేషన్ బియ్యం ధర్మాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. ధర్మాబాద్‌లో మహారాష్ట్ర పోలీసుల సహకారంతో రవుఫ్ గోదాముపై దాడి చేసి 40 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే భైంసాలో పట్టుబడిన లారీలో రేషన్ బియ్యం రిసైక్లింగ్ అయి మహారాష్ట్రకు వెళ్తున్నట్లు గుర్తించారు. అబ్దుల్ రవుఫ్‌తో సంబంధాలు ఉన్న లక్ష్మణచాంద మండలంలోని హన్మంత్‌రెడ్డి రైస్ మిల్లులో దాడులు చేయగా కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌కు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రెండు ట్రక్కులను సీజ్ చేశారు. అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించే లేదని ఎస్పీ వెల్లడించారు. రేషన్ బియ్యం రాకెట్ కేసులో ఇద్దరు డ్రైవర్లను అరెస్టు చేయడంతో పాటు లారీ టాటా, మ్యాజిక్ వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోశించిన ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనాను ఎస్పీ అభినందించారు. ఇందులో సీఐలు నైలు, మల్లేష్, ఎస్సై శ్రీనివాస్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తర తెలంగాణకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్‌ను ఓడించాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

ఉత్తర తెలంగాణకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్ఎస్‌జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉత్తర తెలంగాణ నుంచి ఒకే ఒక మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారని, మిగతా మంత్రులంతా దక్షిణ తెలంగాణ వారేనని, దీంతో తెలంగాణ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడుతోందని అన్నారు. ప్రతి కార్యకర్త ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ముధోల్ నియోజకవర్గంలో 4890 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, 25 మంది ఓటర్లకు ఒక ఇన్చార్జిగా నియమించి, బాధ్యతలు అప్పజెప్పడం జరుగుతుందన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను సైతం పిలిపించి వారు ఓటు హక్కును వినియోగించుకునేలా ఇన్‌చార్జీలు కృషి చేయాలన్నారు. ముధోల్‌కు చెందిన సంతోష్ 285 మంది పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించడంలో కృషి చేయడంతో వారిని అభినందించారు. పట్టణంలో తాజా మాజీ కౌన్సిలర్లు తొమ్మిది మంది బాధ్యతగా తీసుకొని పట్టభద్రులను కలిసి, బిజెపి అభ్యర్థులకు ఓటు వేసేలా పాటుపడాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలంటే, ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయ బావుటా ఎగురవేయలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యను గెలిపించాలన్నారు.

నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులకు సన్మానం

ఇటీవల బిజెపి నూతన మండల అధ్యక్షులుగా ఎన్నికైన వారిని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్, జిల్లా అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి సన్మానించారు. కుభీర్ మండల అధ్యక్షులుగా ఎన్నికైన దత్త్రాత్రి, ముధోల్ మండల అధ్యక్షులుగా ఎన్నికైన కోరి పోతన్న, భైంసా మండల అధ్యక్షురాలిగా ఎన్నికైన సిరం సుష్మరెడ్డి, తానూర్ మండల అధ్యక్షునిగా ఎన్నికైన లక్ష్మారెడ్డిని సత్కరించారు. కార్యక్రమాల్లో బిజెపి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి హరినాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపల్లి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

శబరిమాత ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే హాజరు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కుచులాపూర్ గ్రామంలో శబరిమాత ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. అనంతరం గ్రామస్తులు నిర్వహించిన శబరిమాత పల్లకి ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి భజన కీర్తనలు చేశారు. వార్షికోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేను గ్రామస్తులు, ఆలయ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ ఎంపిపి తుల శ్రీనివాస్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రమోహన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు బీజేఎల్పీ నేత స్వాగతం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని విజయ హైస్కూల్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనరెడ్డికి బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విందులో గవర్నర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రణాళికతో ముందుకెళ్తే సమస్యలు పరిష్కరించొచ్చు

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-ఖానాపూర్



గ్రామాల్లో, పట్టణాల్లో అధికారులు ప్రణాళికతో ముందుకు వెళ్తే సమస్యలు పరిష్కరించవచ్చని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం మండలంలో ఆమె పర్యటించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన పారిశుధ్యం, పచ్చదనం పెంపొందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో కలెక్టర్ పర్యటించి, నిర్వహిస్తున్న పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 10నుంచి ఈ నెల 15 వరకు జిల్లాలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డుల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. పారిశుధ్య కార్మికులు మురికి కాలువలను శుభ్రం చేసిన తర్వాత ఆయా వార్డులోని ప్రజలతో సంబంధిత రిజిస్టర్‌లో సంతకాన్ని తీసుకోవాలన్నారు. వార్డులో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలు, మెరుగైన పారిశుధ్య నిర్వహణలో ప్రజల సహకారం అవసరమన్నారు. తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి చెత్త బండ్లలో వేయాలని, పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని తెలిపారు. ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు, పొదలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 9వ వార్డు సమీపంలో గల బొడ్డుని కుంటను పరిశీలించి, మురికి నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో కుంట చుట్టూ మొక్కలు నాటి, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కుంటలో మురికి నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందడం ద్వారా అనేక రకాల రోగాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం మస్కాపూర్ కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. కేజీబీవీలోని వంటగది, సరుకుల నిల్వగది, విద్యార్థుల వసతి గదులను తనిఖీ చేశారు. కేజీబీవీ పరిసరాల్లో నిరంతరం పారిశుధ్య చర్యలు కొనసాగించాలన్నారు. రాత్రి వేళలో సరైన లైటింగ్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో అందమైన మొక్కలను నాటాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులను పలు సబ్జెక్టు ల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో గణితం లెక్కలను చేయించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సరైన సమయపాలన పాటిస్తూ విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఎప్పటికప్పుడు చదవాల్సిన సిలబస్ పూర్తి చేసుకుంటూ మంచి ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం సత్తెనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో చేపట్టిన శ్రమదాన కార్యక్రమంలో అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొని పిచ్చి మొక్కల్ని తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ నెల 15 వరకు జిల్లాలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులందరూ శ్రమదాన కార్యక్రమాలను చేపట్టి, కార్యాలయాలను, కార్యాలయ పరిసరాలను శుభ్రపరచుకోవాలన్నారు. నర్సరీని పరిశీలించి నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. నర్సరీ నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాలలో డీఈఓ పి.రామారావు, డిపిఓ శ్రీనివాస్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ సుజాత, సిపిఓ జీవరత్నం, ఎంపీడీవో సునీత, ఎంపీఓ రత్నాకర్, కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు సునీత పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను అందించి.. సమస్యలను విన్నవించి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామల దేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని అర్జీలను స్వీకరించారు. ప్రజలు వారి సమస్యలను విన్నవిస్తున్న దరఖాస్తులు అందించగా వాటిని పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ప్రజావాణిలో వివిధ సమస్యలపై 77 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి



తమ గ్రామానికి రోడ్డు మంజూరైనా నిర్మాణానికి నోచుకోవడం లేదని, రోడ్డు సౌకర్యం కల్పించేలా చూడాలని గాదిగూడ మండలం కుండిషేక్‌గూడ గ్రామస్తులు కోరారు. ఈ విషయమై సోమవారం గ్రామస్తులు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చారు. ఈ మేరకు తమ సమస్యను విన్నవిస్తూ అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇదివరకు పంచాయతీరాజ్ అధికారులను కలిసి విన్నవించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల, నాయకులు లింగాల చిన్నన్న, కె.ఆశన్న, కుండిషేక్‌గూడ పటేల్ దౌవులత్‌రావ్, భీంరావ్ ఉన్నారు.

ఉద్యోగం ఇవ్వండి సారు...!



స్టాఫ్ నర్సింగ్ ట్రెనింగ్ పూర్తి చేసిన తమకు ఉద్యోగం ఇవ్వడం లేదని పలువురు స్టాఫ్ నర్సులు వాపోయారు. ఉట్నూర్, గాదిగూడ నుండి బాధితులు శైలజ, విజయలక్ష్మి, నీల ప్రజావాణికి వచ్చారు. అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి విన్నవించారు. ట్రెనింగ్ పూర్తి చేసి ఏడు సంవత్సరాలు అవుతుందని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ లేదా అవుట్ సోర్సింగ్ పోస్టుకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమకు పోస్టింగ్ ఇవ్వడం లేదని వాపోయారు. తమకు ఏ పీహెచ్‌సీలో ఉద్యోగం ఇచ్చినా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

చీటింగ్ కేసు నమోదు చేయాలి



ఏక కాలంలో రెండు రెగ్యులర్ కోర్సులు కలిగి ఎస్జీటీ స్పెషల్ ఉద్యోగం పొందిన సౌజన్యపైన న్యాయ విచారణ జరిపించాలని తాంసి మండలానికి చెందిన అభ్యర్థి నవీన్ కుమార్ కోరారు. ఒకే అకాడమిక్ ఇయర్‌లో రెండు రెగ్యులర్ కోర్సులను ఆమె చేసిందని ఆరోపించారు. ఒక సాధారణ విద్యార్థిగా సుమారు 350 కి.మీ దూరంగా ఉన్న వేర్వేరు ప్రదేశాలలో ఒకేసారి రెండు కోర్సులు చేయడం సాధ్యం కాదన్నారు. కావున తప్పుడు సర్టిఫికెట్ పెట్టి అధికారులను తప్పు దోవ పట్టించిన ఆమెపైన చీటింగ్ కేసు నమోదు చేయాలన్నారు. వెంటనే ఆమెను విధుల్లో నుంచి తొలగించి, తనకు న్యాయం చేయాలని కోరారు.

పెండింగ్ బకాయిలు చెల్లించండి



బెస్టు అవేలేబుల్, ప్రభుత్వ ప్రయివేట్ కళాశాలలో చదువుతున్న పేద మధ్యతరగతి పిల్లల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కుంటాల రామన్న డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు కాలేజీలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్స్, హాస్టల్స్‌కు రావలసిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమన్యంపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవేందర్, లింగన్న, హరీష్, నరేందర్ ఉన్నారు.

రైస్ మిల్లులపై అధికారుల దాడులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



లక్ష్మణచాంద మండలంలోని తిర్పెల్లి గ్రామ శివారులోని శ్రీనిర్వాణ, ప్రతిమ రైస్ మిల్‌లలో అధికారులు దాడులు చేపట్టారు. ఆదివారం రాత్రి నుంచి పోలీసులు, సివిల్ సప్లై అధికారుల సంయుక్త దాడులు నిర్వహించారు. గత యాసంగిలో సీఎంఆర్ రైస్ మిల్లింగ్ కోసం ఇచ్చిన ధాన్యం, ఇప్పటి వరకు ప్రభుత్వానికి అందించని సీఎంఆర్ రైస్ వివరాలు సేకరించారు. ఇందులో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఎస్‌ఓ క్రాంతి కుమార్, సీఐ నవీన్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సెగ్రిగేషన్ పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సెగ్రిగేషన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని దిలావర్‌పూర్ మండల ఎంపీఓ గోవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని కాల్వ గ్రామంలో ప్రత్యేకాధికారి రాజశేఖర్‌తో కలిసి సెగ్రిగేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తడి పొడి చెత్త వేరు చేసి సెగ్రిగేషన్ పనులను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్

ఫిర్యాదుదారుల సమస్యలు విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల ఎస్సై, సీఐలకు ఫోన్‌తో మాట్లాడి సమస్యకు సంబంధించిన వివరాలను తెలియజేసి, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ, సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలియజేశారు.

ప్రజలందరూ పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-కడెం

ప్రజలందరూ పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఆర్డీఓ విజయలక్ష్మి సూచించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి ఆమె రోడ్డు ఊడ్చారు. ఇండ్ల చుట్టూ పిచ్చి మొక్కలు పెరగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం కొండుకూర్, కన్నాపూర్, పాండ్వాపూర్ అలాగే మండల కేంద్రంలోని నర్సరీలు సందర్శించి, అన్ని మొక్కలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జయదేవ్, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని తేజాపూర్‌కు చెందిన చౌలమద్ది రంజిత్ తన తండ్రి చౌలమద్ది చిన్న నర్సయ్య జ్ఞాపకార్థం ప్రాథమిక పాఠశాల తేజాపూర్ గురుకుల శిక్షణ విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్స్ అందించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ తన నాన్నకు విద్య అంటే చాలా ఇష్టమని తెలిపారు. అందుకే ఆయన పేరు మీద ఇలాంటి సమాజ సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూమరెడ్డి, జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు మణిలత, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు సంతోష్, శ్రీనివాస్‌గౌడ్, పోతారెడ్డి, పద్మనాభరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చౌలమద్ది గంగయ్య, రమేష్, అశోక్, రాజేశ్వర్, వినోద్, ప్రశాంత్, బాబు పాల్గొన్నారు.

ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌పై శిక్షణ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లాలో సోమవారం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని డీఈఓ రామారావు ప్రారంభించారు. సోమవారం జిల్లా కేంద్రంలో సోమవార్‌పేట్ బాలికల పాఠశాల, కస్బ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ శిక్షణను ఇచ్చారు. నేటి కాలంలో డిజిటలైజేషన్ విద్యను అవలంబించడంలో మన జిల్లా ముందు స్థానంలో ఉండాలన్నారు. ప్రతి ఒక ఉపాధ్యాయుడు నేటి డిజిటల్ యుగానికి అనుగుణంగా తన సామర్థ్యాలను పెంచుకోవడానికి ఉపయోగపడతాయని అన్నారు. ఇందులో ఉపాధ్యాయులు, జిల్లాస్థాయి డీఆర్పీలు, మండల స్థాయి ఆర్పీలు పాల్గొని, కాంప్లెక్స్ స్థాయిలోని ఉపాధ్యాయులు అందరూ కూడా పాల్గొని, అందరూ ఈ విషయాలని అవగాహన చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ శిక్షణలో ఏఎంఓ నర్సయ్య, ఎంఈఓ పరమేశ్వర్, ఏసీజీఈ పద్మ, ఆర్పీలు పాల్గొన్నారు.

13 నుంచి ఛత్రపతి శివాజీ జయంతి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వారోత్సవాలను ఈనెల 13 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్టు శివాజీ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈనెల 12న ప్రతి హిందువు ఇంటిపై కాషాయం జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. 19న జయంతి సందర్భంగా పట్టణంలో సాయంత్రం 4 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి అంబేద్కర్ చౌక్ మీదుగా శివాజీచౌక్ వరకు భారీ బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. హిందూ బంధువులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, వక్తగా ఉల్లెంగ ముత్యం హాజరవుతున్నట్టు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే రద్దు చేయాలి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం తెలంగాణ ప్రభుత్వంపై నిరసనను వ్యక్తం చేస్తూ, ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట మానవహారం నిర్వహించి, నినాదాలు చేశారు. వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును రద్దు చేయాలని, లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్రం మొత్తం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. పలువురు మాల సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని ఎస్సీ వర్గీకరణను, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అమలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు ఉద్యమాల్ని ఆపేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం మాలలకు న్యాయం చేసి, అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్‌లు కుంటోల్ల వెంకటస్వామి, బత్తుల రంజిత్, జిల్లా కోకన్వీనర్‌లు పురుషోత్తం, అడిగ బోస్, డాక్టర్ ప్రభాకర్ సానే, అంబకంటి ముత్తన్న, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కొంత మురళీధర్, సంపెర్ల రత్నయ్య, దేవుళ్ల మధు, కప్పకంటి సురేష్, సాద విజయ్, ఆకుల రమేష్, పి.సతీష్, తలారి రాజేశ్వర్, కోట సాయిబాబా, డి.సత్యనారాయణ, నిర్మల్ జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మాల సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంని కలిసిన మాలీ మహా సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అఖిల భారతీయ మాలీ మహా సంఘం జాతీయ, రాష్ట్ర, ఉమ్మడి జిల్లాల నాయకులు హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే నేతృత్వంలో 21 మంది నాయకుల బృందం కలిశారు. మహాత్మ జ్యోతిరావు పూలే తలపాగ, కండువా, జ్యోతిరావు పూలే సమగ్ర వాంగ్మయ గ్రంథాన్ని బహుకరించారు. అనంతరం 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ సీఎంకు అందజేసి పరిష్కరించాలని కోరారు. దానికి సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం మాలీల ఎస్టీ హోదా అంశంతో పాటు మిగతా అంశాలను పరిష్కరించేలా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే మాట్లాడారు. తెలంగాణ మాలీలకు ఎస్టీల హోదా కల్పించాలని గత ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం కోసం కేంద్రానికి పంపిందన్నారు. ఆ బిల్లును కేంద్రంపై ఒత్తిడి పెంచి ఆమోదింప చేసుకుని మాలీలకు న్యాయబద్ధంగా రావాల్సిన ఎస్టీ హోదాను కల్పించాలని కోరారు. అలాగే మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు జీవిత చరిత్రలు అన్ని తరగతుల పాఠ్య పుస్తకాల్లో ప్రచురించాలని, ట్యాంకు బండ్‌పై పూలే దంపతుల విగ్రహాలను నెలకోల్పాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలీ కులస్తులకు టికెట్లు ఇచ్చి గెలిపించుకొని రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన దిలీప్ గణపతి నేవసే సర్, జాతీయ అధ్యక్షులు విలాసరావు పాటిల్, గుజరాత్ సంఘ అధ్యక్షులు డాక్టర్ శ్యామరావు పూలే, మధ్యప్రదేశ్ అధ్యక్షులు అడ్వొకేట్ అఖిల వాగేలా, మాలి మహా సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వినోద నాగోశే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షెండే, రాష్ట్ర కోశాధికారి సతీష్ గురునులే, యువనేత వినోద్ ఉన్నారు.

రెండో కేటగిరిలోకి మాంగ్ సమాజాన్ని మార్చాలి

- మంద కృష్ణ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఏబీసీడీగా కాకుండా 1, 2, 3, 4 కేటాగిరిలను చేశారని, అందులో మాంగ్ సమాజాన్ని మొదటి కెటాగిరిలో పెట్టారని, దాని కారణంగా నష్టపోవాల్సి వస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బాలాజీ కంబ్లె అన్నారు. మొదటి కేటాగిరి నుంచి రెండో కేటాగిరి మార్చాలని డిమాండ్ చేస్తూ, ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎస్సీ మాంగ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వర్గీకరణలో మాంగ్‌లకు అన్యాయం జరుగుతుందని, వెంటనే సవరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కాంబ్లే బాలాజీ మాట్లాడుతూ 30 ఏండ్ల ఉద్యమం తరువాత అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కేటాగిరిలుగా చేయడం సంతోషకరమైన విషయమన్నారు. కానీ ఏబీసీడీలుగా చేయకుండా 1, 2, 3, 4లుగా చేశారన్నారు. ఇందులో మాంగ్ సమాజానికి కేటాగిరిని సక్రమంగా చేయలేదన్నారు. వారికి న్యాయం చేసేలా ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేశారు. అధికారంలో సమాజం నాయకులు కూడా పట్టింపు లేకుండా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో మోరే నర్సింగ్, గౌవాడే రవి, గైక్వాడ్ సూర్యకాంత్, మధుకర్, విఠల్, కాంబ్లే ఉద్ధవ్, దాసరి రాంప్రసాద్, డోంగ్రె సంజీవ్ పాల్గొన్నారు.

కరాటే ఛాంపియన్ షిప్‌లో మెడల్స్ సాధించిన విద్యార్థులు



నవతెలంగాణ-కడెం

హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్ కుంగ్‌ఫు కరాటే ఛాంపియన్ షిప్‌లో మండలంలోని లింగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. ఈ ఛాంపియన్ షిప్ నందు కసుల రక్షిత గోల్డ్ మెడల్ సాధించగా, ఎం. సాహిత సిల్వర్ మెడల్ సాధించినట్టు కరాటే మాస్టర్లు మనోహర్, ఆరిఫ్‌ఖాన్, విహారి తెలిపారు.

రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వ పీహెచ్‌సీలో రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి డా.కుడ్మెత మనోహర్ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా డ్యూటీ రిజిస్టర్‌తో పాటు వివిధ రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది ప్రతి రోజు సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. టీబీ సర్వేను ప్రతి గ్రామంలో చేపట్టాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ వ్యాధికి ప్రభుత్వ హాస్పిటల్స్‌తో పాటు పీహెచ్‌సీలో సైతం ఉచితంగా మందులను అందజేయడం జరుగుతుందన్నారు. వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటుకు పోవడంతో కలుషిత నీటితో డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందన్నారు. ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రధాన్ గూడలో నిర్మించిన సబ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక వైద్యులు శ్రీకాంత్, హెచ్‌ఏ వినోద్ పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధుల శాతం పెంచాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో విద్యారంగానికి 30శాతం నిధులు పెంచుతానని చెప్పి హామీ ఇచ్చి, గత ప్రభుత్వం వ్యవహరించినట్టు ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తున్నదని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వృకోదర్ అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగానికి 20శాతం నిధులు ఇస్తానని చెప్పి ఎన్నికల్లో హామీ ఇచిందని, ఆ హామీని విస్మరించి 15శాతం ఉన్న విద్యారంగానికి ఏడు శాతం నిధులు తగ్గించిందన్నారు. కాగా ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం అదే ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. నిధులు కేటాయించాలని లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేష్, సాయినాథ్, దిలీప్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కేశవ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మాన్యాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో 89 విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో హెచ్‌ఈఓ తులసిదాస్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవ్‌శావ్, వైద్య సిబ్బంది రవీందర్, ఈశ్వర్, రాధ, వార్డెన్ చౌహాన్ సుభాష్ ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఎలాంటి రోగాలు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రామరావు బాగ్, భాగ్యనగర్ వార్డుల్లో మురుగు కాలువలు తొలగించి, వెంటనే చుట్టుపక్కల బ్లీచింగ్ వేయించారు. తడి పొడి చెత్తను వేరుచేసి చెత్త సేకరించే మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, మెప్మా పీడీ సుభాష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సాంకేతికంగా బలోపేతం కావాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని విషయాలు బోధించే ఉపాధ్యాయులు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఉపయోగించే విధానాన్ని తెలుసుకొని, ప్రతి రోజు వాటిని ఉపయోగిస్తూ, విద్యార్థులకు బోధన జరపాలని డీఈఓ ప్రణీత ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో ఆయా భాష విషయ ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీలు ఉపయోగించే విధానంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలక్ మందిర్‌లో ఉర్దూ విషయ ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో సెక్టోరల్ అధికారి జే.నారాయణ, ఏఎస్సీ ఉస్మాన్, రిసోర్స్ ఉపాధ్యాయులు, ఆయా మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



నవతెలంగాణ-బేల

విశ్వ సృష్టికర్త భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలను సోమవారం మండల కేంద్రంలో మరాఠీ వడ్రంగి కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘ భవనం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ప్రపంచ నిర్మాణంలో విశ్వకర్మ పాత్ర ఎనలేదని వక్తలు పేర్కొన్నారు. కులస్తులందరూ ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంది మౌనారెడ్డి, పాయల్ ఫౌండేషన్ చైర్మెన్ పాయల శరత్, మార్కెట్ కమిటీ చైర్మెన్ అశోక్ రెడ్డి, ఎస్సై దివ్యభారతి, మాజీ ఎంపీపీ కుంట రఘుకుల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు సామ రూపేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్లు మస్కె తేజ్‌రావు, దేవన్న, బీజేపీ మండలాధ్యక్షులు ఇంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావార్, బీఆర్ఎస్ నాయకులు ప్రమోద్ రెడ్డి, సతీష్ పవార్ వివిధ పార్టీల నాయకులు, కుల సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సంతోష్, మండలాధ్యక్షుడు అభయ్, వెంకటి, విష్ణు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవం



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం పిప్పల్‌కోటి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు భక్తి మార్గాన్ని అనుసరించడంతో చెడు వ్యసనాలకు దూరం ఉండటమే కాకుండా గ్రామాల్లో కుటుంబాలు సంతోషంగా ఉంటాయన్నారు. ఆలయాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు ఆలయ కమిటీ సభ్యులు గడ్డం లస్మన్న, కేమ గంగయ్య, సంతోష్ రమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ కే.కల్పన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజల సలహాలు సూచనలు, ఫిర్యాదుల కొరకు 9959226002 ఈ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 11, 2025 | www.navatelangana.com

కాగజ్‌నగర్ బస్టాండ్‌లో చోరీ

- మూడు తులాల చంద్రహారం అపహరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ బస్టాండ్‌లో సోమవారం చోరీ జరిగింది. టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం మంచిర్యాల జిల్లా జైపూర్‌కు చెందిన నరెడ్ల శకుంతల కాగజ్‌నగర్‌లోని తన చెల్లె ఇంట్లో జరిగే పూజా కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చింది. తిరుగు ప్రయాణం కోసం సోమవారం కాగజ్‌నగర్ బస్టాండ్‌కు వచ్చింది. కొద్ది సేపటికి బస్సు రాగా అందులో ఎక్కిన తర్వాత హ్యాండ్ బ్యాగ్‌ను చూసుకోగా అది జిప్ తెరిచి ఉండడంతో అనుమానం వచ్చింది. బ్యాగ్ పూర్తిగా పరిశీలించగా అందులో పర్సు కనిపించలేదు. అందులో మూడు తులాల బంగారు గొలుసు (చంద్రహారం) ఉందని, అది దొంగతనానికి గురైందని బాధిత మహిళ కాగజ్‌నగర్ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కంటి బాధితులకు శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య సర్వీసు సొసైటీ ఉచితంగా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. గతంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆపరేషన్లకు ఎంపికైన 13 మందికి భోజన సదుపాయం కల్పించి సొసైటీ ఖర్చులతో సోమవారం ఆపరేషన్ల నిమిత్తం బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆసుపత్రికి పంపించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత 9 సంవత్సరాలలో వేల మందికి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యశిబిరం ఇన్‌ఛార్జి గోపి, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం నెం.2పై గుర్తు తెలియని రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ప్లాట్‌ఫారం నుండి రెండో నెంబర్ రైల్వే ట్రాక్‌పై దిగగా, అదే సమయంలో వచ్చిన రైలు అతన్ని ఢీకొట్టడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన వివరించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపర్చామని, వివరాలు తెలిసిన వారు 9948481902 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

- బెల్లంపల్లి జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్



నవతెలంగాణ-రెబ్బెన

గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయమని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం సింగరేణి పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు వార్షిక పరీక్షల సాధన కోసం పుస్తకాలను సమకూర్చారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదివి 100శాతం ఫలితాలు సాధించాలన్నారు. పూర్వ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తూ ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయమన్నారు. పూర్వ విద్యార్థి సంఘం భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అటుబడి పిల్లలకు వెనుకబడిన విద్యార్థులకు సేవ ధృకదంతో విద్యార్థులకు సాయం చేయడం ఎంతో మంచి పరిణామన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ అండ్ కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, హెచ్ఎం రవితేజ, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్, పూర్వ విద్యార్థులు కోట సుధాకర్, శ్రీధర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాపూర్ జాతరకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్‌లో నేటి నుండి మూడు రోజుల పాటు నిర్వహించే జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు డిపో మేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. జాతరకు వెళ్లే భక్తుల కోసం డిపో నుండి మొత్తం 18 బస్సులను నడుపనుండగా వీటిలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, బెల్లంపల్లి 06 చొప్పున ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, బెల్లంపల్లి నుంచి పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.40 చార్జీలుంటాయన్నారు. జాతరకు వెళ్లే ప్రతి మహిళకు మహాలక్ష్మి స్కీం వర్తిస్తుందని తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓటరు లిస్టు ప్రదర్శన



నవతెలంగాణ-తిర్యాణీ

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఏడు ఎంపీటీసీ స్థానాలకు చెందిన ఓటరుల జాబితాను మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించినట్టు ఎంపీడీఓ మల్లేష్, ఎంపీపీ మర్సకోల శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల అవసరాల కోసం ప్రత్యేకంగా సర్వే చేసి సేకరించినట్టు పేర్కొన్నారు. తప్పులు, ఇతర అభ్యంతరాలను తెలియజేయవచ్చని తెలిపారు.

కౌటాల : రాబోయే రోజుల్లో జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు గాను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సోమవారం ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలో లిస్టు ఉంటుందని ఎంపీడీఓ కోట ప్రసాద్ తెలిపారు.

దర్గా భూముల వేలం పాట

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ తాలిబ్ అలీ షా బాబా దర్గాకు చెందిన 10 ఎకరాల చేను, డోర్‌పల్లి గ్రామంలోని 2 ఎకరాల పొలంకు ఈ నెల 14న వేలం పాట వేయడం జరుగుతుందని దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ సాలె బిన్ సయిద్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సయ్యద్ తాలిబ్ అలీ షా బాబా దర్గా వద్ద 2 సంవత్సరాలకు గాను వేలం పాట వేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9550572163ను సంప్రదించాలన్నారు.

నేడు మండలంలో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఈరోజు 132/33 కేవీ ఈస్‌గాం విద్యుత్ కేంద్రంలో మరమత్తు పనులు జరుగుతున్నందున సిర్పూర్-టీ, లోనవెల్లి విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్‌లో అంతరాయం ఉంటుందని ఏఈ ఇర్ఫాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ శాసనమండలి పట్టభద్రుల, ఉపాధ్యాయం ఎన్నికల నిర్వహణ జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శాసనమండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గానికి ఈనెల 27న పోలింగ్ జరగనున్నందున జిల్లాలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు, ఫర్నిచర్, షామియానా, మూత్రశాలలు, క్యూ లైన్లు ఇతర అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

అనంతరం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరుపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గత సంవత్సరం పాఠశాలలో 10వ తరగతి ఫలితాలు, ఈసారి ఫలితాల సాధన అంశాలపై మాట్లాడుతూ విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు తరగతులు నిర్వహించి ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పరీక్షలకు 40 రోజుల సమయం మాత్రమే ఉన్నందున ప్రణాళికకు అనుగుణంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా పర్యవేక్షించాలని, ప్రిసైడింగ్ అధికారి డైరీ పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. టెండర్ ఓట్ చాలెంజ్ ఓటులో ప్రతి కవర్ పై అవగాహన పెంచుకోవాలని, అదనపు పోలింగ్ అధికారి, పోలింగ్ క్లర్కులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలని, ఉపయోగించిన బ్యాలెట్ పేపర్లు, ఉపయోగించని బ్యాలెట్ పేపర్ల వివరాలు నమోదు చేయాలని, వ్యాలెట్ పేపర్లు వరుస సంఖ్యలో ఉండేలా చూడాలని తెలిపారు. ఎన్నికలు పూర్తిగా బ్యాలెట్ పద్ధతిలో జరుగుతాయని, బ్యాలెట్ బాక్సులపై ఏజెంట్ల సమక్షంలో సీలువేయాలని, ప్రిసైడింగ్ అధికారి ప్రతి సమాచారాన్ని డైరీలో నమోదు చేయాలని తెలిపారు. పోలింగ్ సిబ్బందితో పాటు సూక్ష్మ పరిశీలకులు కూడా విధులు నిర్వహిస్తున్నారని, జిల్లాలో 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, పోలింగ్ నిర్వహించే సిబ్బంది ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారంలోగా ఇంకోసారి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, తహసీల్దార్లు రామ్మోహన్, రోహిత్, ప్రిసైడింగ్ అధికారులు, అదనపు డిసైడింగ్ అధికారులు, పోలింగ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి గమేనియల్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీఎస్ఎస్ పాఠశాలల నుండి 10 జీపీఏ సాధించేలా కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న స్లిప్ టెస్ట్ ఫలితాలను జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు సమీక్షించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు వారి కన్నా తక్కువ తరగతి విద్యార్థులతో అభినందనలను చెప్పించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల విలువైన సమాచారాన్ని గుర్తించేలా చర్య తీసుకోవాలని సూచించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించాల్సిన వివిధ రకాల కమిటీలు ఏర్పాటు చేసి వాటిని ప్రధానోపాధ్యాయులు గోడలపై ప్రదర్శించి ప్రదర్శన గ్రేడింగ్ సూచికలు పూర్తి చేయాలన్నారు. వివిధ పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీలను అమలయ్యే విధంగా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని కోరారు. జిల్లాలోని నలుగురు కోఆర్డినేటర్లు పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని ఉపాధ్యాయులు మైక్రోసామర్థ్యాలు సాధించేలా బోధిస్తున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. పాఠ్యం పుస్తకానికి వర్క్ బుక్‌కి సమన్వయం ఉండేలా చూడాలని, తప్పనిసరిగా లైబ్రరీ పీరియడ్ ఉపయోగించుకోవాలన్నారు. సైన్స్ మెటీరియల్స్ ఉపయోగించుకొని బోధించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షల అధికారి ఉదయ బాబు, ఫైనాన్స్ అకౌంట్ అధికారి దేవాది, కోఆర్డినేటర్ కటుకం మధుకర్, అబ్దుల్ అలీ, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేర రహిత సమాజం కోసం కృషి

- ఆర్ఆర్ కాలనీలో కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేర రహిత సమాజమే తమ లక్ష్యమని దీంతో పాటు నేరాలు నియంత్రణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. మండలంలోని ఆర్ఆర్ కాలనీలో ఎస్పీ, ఏఎస్పీ ఆదేశాలతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని గుర్తించే ఉద్దేశ్యంతోనే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల శాంతిభద్రతలే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కాలనీలోని ఇంటింటికి తనిఖీలు చేసి సరైన ధ్రువపత్రాలు లేని 82 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, నేరాల నియంత్రణకు కృషి చేయనున్నట్టు తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో ఒక సీఐ, నాలుగురు ఎస్సైలతో పాటు 60 మంది పోలీస్ సిబ్బంది తనిఖీలు చేశారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

నవతెలంగాణ-కౌటాల

చోరీ కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. సోమవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. మండలంలోని పార్ది గ్రామానికి చెందిన చాప్లే శ్యాంరావ్ ఈ నెల 7న ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి చేరగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని బీరువాలో భద్రపరిచిన 2 తులాల బంగారు చైను దొంగలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించి ఈ నెల 8న కౌటాల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు విచారణ చేపట్టగా అదే గ్రామానికి చెందిన దుర్గం నాగేంద్ర దొంగతనానికి పాల్పడినట్లు విచారణలో గుర్తించారు. అతని వద్ద నుంచి సొమ్మును రికవరీ చేసి బాధితుడు (శ్యామ్ రావ్)కి అప్పగించారు. చోరికి పాల్పడిన



దుర్గం నాగేంద్రపై కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాలతో పాటు జిల్లా ఆస్పత్రిలో పనిచేసే సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించినంతరం కలెక్టరేట్ ఏఓ మధుకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీవీవీపీ ఆస్పత్రుల సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా ఆస్పత్రితో పాటు కాగజ్‌నగర్, సిర్పూర్(టి), బెజ్జూర్, తిర్యాణీ, వాంకిడి, జైనూర్‌లో పని చేస్తున్న సానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల వేతనాలను ప్రభుత్వం సంవత్సరానికి ఒకసారి మాదిరిగా చెల్లిస్తుందని ఆరోపించారు. 7 నెలల క్రితం ఒకసారి సమ్మె నోటీసు ఇస్తే కొన్ని జీతాలు ఇచ్చిన ప్రభుత్వం మళ్ళీ ఏడు నెలలుగా కార్మికుల బిల్లులు చెల్లించలేదన్నారు. దీంతో జీతాలు ఇవ్వడంలో కాంట్రాక్టర్లు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు నెలలు జీతాలు ఇచ్చి చేతులెత్తేసారని కాంట్రాక్టర్లకు, ప్రభుత్వానికి మధ్యలో కార్మికులు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు ఇలాగే నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే రాబోయే రోజుల్లో పనులను పూర్తిగా నిలిపివేసి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, కార్మికులు రజిత, పుష్ప, పద్మ, సాయి, నరేష్, తిరుమల, మీనాక్షి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీనియర్ సిటిజన్లకు ప్రభుత్వపరంగా మెరుగైన వైద్యసేవలందించాలని సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు కలికోట రమణయ్య, ఆకుల నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, చిలుక లక్ష్మీనారాయణ ఒక సంయుక్త ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్ల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిబంధనలున్నా అవి ప్రభుత్వ ఆస్పత్రులలో అమలు కావడం లేదని విమర్శించారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి సీనియర్ సిటిజన్లకు ఉచిత ఆరోగ్య సేవలు మెరుగ్గా అందేలా చూడాలని వారు కోరారు. ఇప్పటికే అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీనియర్ సిటిజెన్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-తిర్యాణీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నమూనా ఇల్లు నిర్మాణానికి ఎంపీడీఓ మల్లేష్, హౌజింగ్ డీఈ వేణుగోపాల్ భూమి పూజ చేశారు. సోమవారం కార్యాలయంలోని ఖాళీ స్థలంలో చదును చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో నమూనా ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించామన్నారు. త్వరలోనే ఇల్లు నిర్మాణం చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలం దుబ్బగూడ గ్రామంలో ప్రజాబంధు మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పాల్వాయి పురుషోత్తం రావు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని జట్ల మధ్య టాస్ వేశారు. అనంతరం క్రికెట్ ఆడి ఉత్సహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువకులు క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆటల్లో యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని, వ్యసనాలకు దూరంగా ఉండడంతో పాటు సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు చంకాపురే లావణ్య, ఒడ్డెటి నాని, కిరిమరే శ్యాంరావు, విలాస్, అశోక్ ఆర్య, దుర్గం ప్రశాంత్, యువ మోర్చ మండల అధ్యక్షులు సాయి భనార్కర్, నూలిగొండ రాజశేఖర్, శేఖర్, సాయి పాల్గొన్నారు.



ఎంపీ గడ్డం వంశీకృష్ణ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జైపూర్

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జన్మదిన వేడుకను సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతకు ముందు ఎంపీ తండ్రి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పుష్ప గుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు చెతిపి ఆశిర్వదించారు. చెన్నూర్ నియోజకవర్గం పరిధి జైపూర్, భీమారం మండలాలకు చెందిన సోషల్ మీడియా వారియర్స్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రేపు బాల, బాలికలకు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12వ తేదీన నాగార్జున కాలనీలో అండర్-16 బాలబాలికలకు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రామచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్టు ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లోని షేక్‌నగర్ మైదానంలో నిర్వహించే 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మంచిర్యాల జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల కబడ్డీ క్రీడాకారులు (బాల, బాలికలు) 55 కేజీ లోపు బరువు ఉండి ఏప్రిల్ 1వ తేదీ 2009 లోపు జన్మించిన అమ్మాయిలు, అబ్బాయిలు ఆధార్ కార్డు, ఒక ఫోటో రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకొని 9 గంటల లోపు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొండ్ర కార్తీక్‌కు రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 9912029691 నెంబర్‌ను సంప్రదించలన్నారు.

సింగరేణి డైరెక్టర్ పోస్టుల భర్తీ

నవతెలంగాణ-జైపూర్



సింగరేణిలో ఖాళీ అయిన డైరెక్టర్ పోస్టులకు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎల్‌వీ సూర్యనారాయణతో పాటు ఆడ్రియాల జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. సింగరేణికి సంబంధించిన డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్‌గా ఉన్నటువంటి వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు డైరెక్టర్ ఆపరేషన్స్‌గా ఉన్నటువంటి ఎన్‌వీకే శ్రీనివాస్ పదవీ కాలం ముగియడంతో డైరెక్టర్ల ఖాళీ ఏర్పడింది. ఈ మేరకు డైరెక్టర్ పీపీ, డైరెక్టర్ ఆపరేషన్స్ భర్తీకి సింగరేణి వ్యాప్తంగా ఉన్నటువంటి సీనియర్ సింగరేణి అధికారులు 10 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో నుంచి డైరెక్టర్ ఆపరేషన్స్‌కు శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ ఎల్‌వీ సూర్యనారయణతో భర్తీ చేసిన సింగరేణి యాజమాన్యం డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్‌కు ఆడ్రియాల జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లును ఎంపిక చేసింది.



సింగరేణి కార్మిక హక్కుల సాధనకు కృషి

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి పరిరక్షించుకుని కార్మిక హక్కుల సాధనకు ఉద్యమిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా పరిధి ఇందారం-1ఏ గని, ఐకే ఓపెన్‌కాస్ట్ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాలానుగుణంగా జరిగే స్ట్రక్చర్ సమావేశాలను కూడా నిర్వహించకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పేరుతో స్ట్రక్చర్ సమావేశాలు వాయిదాలు వేయడం ఎమిటని ప్రశ్నించారు. మొన్నటి వరకు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలకు లేనటువంటి ఎన్నికల కోడ్ లేదు, ప్రభుత్వ పథకాలు తదితర వాటికి లేనటువంటి ఎన్నికల కోడ్ సింగరేణి స్ట్రక్చర్ సమావేశాలకు మాత్రమే ఉంటుందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, పిట్ కార్యదర్శులు నవీన్‌రెడ్డి, అగ్గు శ్రీకాంత్, ధరణి దేవేందర్, వెంకటేష్, సత్తయ్య, వెంకటస్వామి, పద్మరాజు పాల్గొన్నారు.



ఎంపీ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం



నవతెలంగాణ-మంచిర్యాల

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలోని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి నివాసంలో సోమవారం అభిమానులు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీ పుట్టిన రోజు సందర్భంగా జిల్లా లోని తలసేమియా సికిల్ సెల్ వ్యాధి గ్రాస్తులకు అందజేస్తామని అభిమానులు పేర్కొన్నారు. ఈ బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లో సుమారు 100 మంది యువకులు స్వచ్ఛందంగా బ్లడ్ డొనేషన్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నిరుద్యోగ సమస్యలు, యువతకి ఉపాధి నియోజక వర్గ ప్రజల అభివద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న గడ్డం వంశీకృష్ణ ఎల్లవేళలా ఆయురారోగ్యలతో ఉండలని అబిమానులు కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన పెంచాలి



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులకు తన చిన్నతనం నుంచే ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన కల్పించాలని పొన్కల్ యూపీఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె రాజేశం అన్నారు. సోమవారం విద్యార్థులకు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, స్థానిక పోలీస్‌స్టేషన్ ఫైర్ స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాలకు తీసుకువెళ్లి అక్కడ కార్యాలయాల పరిసరాలను, అధికారులను కలుస్తూ వారికి అవగాహన కల్పించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రాజవర్ధన్, ఫైర్ స్టేషన్‌లో ఫైర్ ఆఫీసర్ డి.శ్రీనివాస్, సబ్ స్టేషన్‌లో ఏఈ లచ్చయ్య, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రామ్మోహన్, ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, మార్కెట్ యార్డు సిబ్బంది వారి కార్యాలయాలు నిర్వహించే విధులను, అధికారుల బాధ్యతలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల వెంట ఉపాధ్యాయులు కె శ్రీకాంత్, బి వనిత ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందాం



నవతెలంగాణ-మంచిర్యాల

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వై అశోక్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకుందామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉపాధ్యాయ మేధావి వర్గం గురించి ఉద్దేశించినవి కాని అలాంటి పదవులను రియల్ ఎస్టేట్, కార్పొరేట్ వ్యవస్థను కాపాడుకోవడానికి పూనుకున్న వ్యక్తులు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తులను ఎన్నుకున్నట్లయితే మన ఉపాధ్యాయ రంగాన్ని, మన హక్కులను మనమే కలరాసుక్కున్న వారమవుతామన్నారు. ఉపాధ్యాయ లోకం విజ్ఞతతో ఆలోచించి ఒక ప్రశ్నించే గొంతుక, తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రో. కోదండరాం సర్‌తో కలిసి ఉద్యమాన్ని నిర్మించిన గొప్ప దార్శనీకుడు, విద్యావేత్త, 35 ఏండ్ల పాటు విద్య వ్యవస్థలో పనిచేసిన వై అశోక్ కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని జిల్లా లోని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వి కిరన్ కుమార్, ఎస్ లావణ్య జిల్లా కోశాధికారి బి కిరణ్, జిల్లా కార్యదర్శి బి దేవదాస్, జె బాపు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జి సంపత్, మండలం అధ్యక్షుడు ఎం భారీక్‌రావ్, ఉపాధ్యక్షురాలు టీ మాలతి, దండేపల్లి మండలం అధ్యక్షుడు జి దేవయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి వ్యాప్తంగా రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్ రాక వేలమంది ఇబ్బందులకు గురవుతున్నారని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్, డిసెంబర్ నెలలో బయోమెట్రిక్ విధానం ద్వారా జీవన్ ప్రమాణ, మెడికల్ హెల్త్ కార్డులు రెన్యువల్ చేసుకోవడంలో చిన్న చిన్న తప్పుల వలన ఈ సమస్య తీవ్రతరం అయిందని పేర్కొన్నారు. ఇలాంటి ఉద్యోగులు ఎవరికి చెప్పుకోవాలో ఎక్కడ కలవాలో తెలియక బ్యాంకులు, మీ సేవ సెంటర్లకు వెళ్లిన తగిన సమాచారం దొరకకపోవడం వలన వారు తీవ్ర నిరాశకు గురై ప్రయివేటు వ్యక్తుల దగ్గరకు వెళ్తే వారు తీవ్రమైన ఆర్థిక దోపిడీకి వీరిని గురి చేస్తున్నారని ఆరోపించారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ వారీగా ఓటర్ జాబితాను అధికారులు ప్రదర్శన చేశారు. 2వ సాధారణ ఎన్నికలు సంధర్భంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పురస్కరించుకొని ఎంపీటీసీల వారిగా ఓటర్ల జాబితా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ శేఖ్ సప్దర్‌అలీ, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో లింగ పునఃప్రతిష్ట

- గట్టు మల్లన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-జైపూర్


మండలంలోని వేలాల గ్రామ శివారు గుట్టదొనలో స్వయంభువుగా వెలసిని గట్టుమల్లన్న గుట్ట దొనలో అత్యంత భక్తి శ్రద్ధల మధ్య శివ లింగం పునఃప్రతిష్టించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాల ద్వార శివ లింగంతో పాటు నందీశ్వరున్ని ప్రతిష్టించారు. వందలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చొప్పకట్ల రాజన్న రేఖా దంపతులు శివలింగంతో పాటు నందీశ్వరిని విగ్రహ పునఃప్రతిష్టను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు హోమము, అష్ట బంధన సహిత మహా కుంభాభిషకం చేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన రామడుగు రాము శర్మతో పాటు సహయకులు లింగ, నందీశ్వర విగ్రహ పునఃప్రతిష్ట అత్యంత వైభవోపేతంగా పూర్తి చేసుకున్నట్లు దేవాదాయ శాఖ ఈఓ రమేష్ తెలిపారు.

కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టండి

- భీమారం వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్

నవతెలంగాణ-జైపూర్

యాసంగి పంటల సాగులో భాగంగా సాగు చేస్తున్న వరి పైరులో కాండం తొలుచు పురుగు గుర్తించినట్లు భీమారం వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ తెలిపారు. వరి పైరును ఆశించిన కాండం తొలుచు పరుగు నివారణ కోసం వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం భీమారం మండలం కొత్తపల్లి శివారు వరి వ్యవసాయ క్షేత్రాలను సంధర్శించిన ఆయన కాండం తొలుచు పురుగును గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా కొత్తపల్లి శివారులో పలు చోట్ల చౌడు భూములు ఉన్నట్లు తెలిపారు. ఫ్లూబెండమైడ్ 40 గ్రామ్స్ లేదంటే కార్‌టాప్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ 75 శాతం, ఎస్‌జీ 200 గ్రామ్స్, క్లోరంతేనిప్రోల్ 0.4 శాతం గుళికలు ఎకరానికి 4 కేజీలు వేసి కాండం తొలుచు పురుగు నివారించుకోవాలని తెలిపారు. అదేవిధంగా చౌడ్ నివారణకు లిక్విడ్ సల్ఫర్ 40 శాతం ఎస్సీ లేదంటే లిక్విడ్ సల్ఫర్ 56.6 శాతం ఎస్సీ 10 కిలోల ఇసుకలో కలిపి ఎకరం పొలంలో పల్చగా నీళ్ల పెట్టి చల్లుకోవాలని తెలిపారు. మూడు రోజుల పాటు ఈ మడుల నుంచి నీరు ఎటువెల్లకుండా చూసినట్లుయితే చౌడును చాలా వరకు నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



ఆశ్రమానికి నిత్యవసర సరుకుల పంపిణి



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలో అమృత హస్తం వెల్ఫేర్ సొసైటీ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమానికి చేయూత అందించారు. మంచిర్యాలకు చెందిన మమతా మహిళ తరంగిని సభ్యులు సోమవారం ఆశ్రమ నిర్వాహకులకు నాలుగు వంట గ్యాస్ స్టవ్‌లతో పాటు వృద్ధులకు వికలంగులకు నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు. మంచిర్యాల మమతా తరంగిని సభ్యులు మంజుల కృష్ణారావు, ఇరుకుల జ్యోతి, లత, నాగమణి పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో కొనసాగుతున్న పూజలు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయంలో దేవతా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా పూర్తయ్యింది. విగ్రహ ప్రతిష్ట కార్యమానికి సింగరేణి డైరెక్టర్ ఈఅండ్‌ఎం, ఆపరేషన్స్, ప్లానింగ్‌అండ్ ప్రాజెక్టు సత్యనారాయణరావు దంపతులు హాజరయ్యారు. సోమవారం దేవతామూర్తుల స్థిర విగ్రహ ప్రతిష్ట పూర్తి చేశారు. అదేవిధంగా సుదర్శన, గోదాదేవి, రామానుజ, ధ్వజస్థంభ ప్రతిష్ట మహోత్సవాన్ని డైరెక్టర్ దంపుతుల చేతుల మీదుగా సాగింది. గత నాలుగు రోజులుగా నూతన ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా గోదావరిఖని వాస్తవ్యులు గోవర్ధనగిరి జగనాథాచార్యుల పర్యవేక్షణలో శిష్య బృందం వేదపండితులు వెంకటాచార్యులు, సముద్రాల భానుకుమార్, సేనాపతి శేషాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, సముద్రాల అనంతాచార్యులు, భరతాచార్యులు అచ్చులాపూర్ వేద పాఠశాల నుంచి వచ్చి విజయవంతంగా పూర్తి చేశారు.

ప్రయాణికుడి కాళ్ళ పై నుండి వెళ్లిన ఆర్టీసీ బస్



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో సోమవారం గోర ప్రమాధం చోటు చేసుకుంది. బస్సు ఎక్కేందుకు వెళ్లిన ప్రయాణికుడి కాళ్ళపై నుంచి ఆర్టీసీ బస్ దుసుకెళ్ళింది. దీంతో ప్రయాణికుడికి తీవ్ర గాయలపాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే కోటపల్లి మండలం జనగాం గ్రామానికి చెందిన చెన్నూరి లక్ష్మణ్ పనుల నిమిత్తం మంచిర్యాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు మంచిర్యాల బస్టాండ్‌లో బస్ కోసం ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో చెన్నూర్ నుంచి మంచిర్యాలకు వచ్చి తిరిగి చెన్నూర్‌కు వెళ్లేందుకు పాయింట్ వద్దకు వచ్చే బస్సు ఎక్కే క్రమంలో కింద పడి పోయాడు. దానితో లక్ష్మణ్ కాళ్లపై నుండి బస్ వెళ్ళింది. ప్రమాదనికి గురైన లక్ష్మణ్‌ను గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమయనానికి బస్సులు రాకపోవడం తోనే ఒకసారిగా వచ్చిన బస్‌ను చుట్టుముట్టడంతో ప్రమాదాలకు గురవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

పులి కదలికలను గుర్తించిన అధికారులు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి రేంజ్ పరిధిలో బుగ్గ దేవస్థానం పరిసరాల్లో దాదాపు 12 రోజుల పాటు సంచరించిన పెద్దపులి ఆదివారం కన్నాల మీదుగా మాదారం ఫారెస్ట్ బీట్ నుంచి సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో రెబ్బెన మండలం పులికుంట మీదుగా నడక సాగించినట్లు అటవీ అధికారులు గుర్తించారు. పాదముద్రల ఆధారంగా ట్రాకింగ్ బృందం పులి సంచారంపై ఎప్పటికప్పుడు అధికారులకు చేరవేస్తున్నారు. సమీప గ్రామాల ప్రజలకు సమాచారం అందిస్తున్నామని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ తిరుపతి తెలిపారు. ప్రస్తుతం పులి రెబ్బెన మండలం పులికుంట గ్రామ అటవీ శివారు వైపు వెళ్లినట్లు గుర్తించామని రాత్రివేళల్లో పరిసర ప్రాంతాల్లో బస చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. అటవీ ప్రాంతాల్లో వెళ్లే పశువుల కాపరులు, రైతులు, ప్రజలు పులి సంచారం, కదిలికలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



మహా జాతర పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని బుగ్గగూడెం గ్రామ పంచాయతీలో ఆదివాసీ నాయక్ పోడ్ సేవా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుగ్గగూడెంలో గాంధారి ఖిల్లా మైసమ్మ మహా జాతర వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 14,15,16 తేదీల్లో జరిగే గాంధారి ఖిల్లా మైసమ్మ మహా జాతర ఆదివాసులందరూ మన సంస్కృతి సాంప్రదాయాలతో ప్రతి కుటుంబం నుంచి వచ్చి జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకోపోడ్ సేవా సంఘం మండల ప్రధాన కార్యదర్శి మేంద్రపు రాజయ్య, గుండా రాజ్కుమార్, నవనందుల వెంకటి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రేషన్ కార్డుల డాటా ఎంట్రీ

నవతెలంగాణ-సిరికొండ



మండలంలో ప్రజాపాలన, గ్రామసభలో వచ్చినటువంటి రేషన్ కార్డు లేని నిరుపేదలకు రేషన్ కార్డులో మార్పులు చేర్పుల డాటా ఎంట్రీ సోమవారం ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా తహసీల్దార్ తుకారాం మాట్లాడుతూ సిరికొండ మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలోని గ్రామాల వారిగా ప్రజాపాలన గ్రామసభలో ఇచ్చిన రేషన్ కార్డు దరఖాస్తులను డాటా ఎంట్రీ చేస్తున్నామని అన్నారు. మండలంలో పూర్తిగా డాటా ఎంట్రీ తొందరలోనే పూర్తవుతుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, సీనియర్ అసిస్టెంట్ ఉమాదేవి, సిబ్బంది రాజేశ్వర్, గణేష్, పోశెట్టి, అమోల్, వసంత్ , దేవిదాస్ పాల్గొన్నారు.

దేశీదారుపై ఉక్కుపాదం

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని బెల్గాం గ్రామంలో సోమవారం సాయంత్రం అక్రమంగా దేశీదారు విక్రయిస్తున్న దుకాణంపైన పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఎస్సై వి.పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం... మెస్రం పొచ్చిరాం అను వ్యక్తి తన పాన్‌షాప్‌లో నిషేధిత దేశీదారు అమ్ముతున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు ఏఎస్సై ఆత్మారాం, పోలీసు సిబ్బంది పాన్‌షాప్‌పై రైడ్ చేయగా తన షాప్‌లో నిషేధిత దేశీదారు 90 ఎంఎలు, 192 లభించాయి. వాటి మొత్తం 17.28 లీటర్స్ కాగా, దాని విలువ రూ.5వేల 184 ఉంటాయని తెలిపారు. ఈ నిషేధిత దేశీదారు బాటిల్స్ స్వాధీనపరచుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మండలాల వారిగా ఓటర్ జాబితా విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మండల వారీగా ఓటర్ల జాబితాను జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మీనారాయణ విడుదల చేశారు. జిల్లాలో 15 మండలాల్లో 3,54,691 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుష ఓటర్లు 1,77105 మంది కాగా మహిళా ఓటర్లు 1,77,567 మంది ఇతరులు 19 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

మాంగ్ కులానికి న్యాయం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీ వర్గీకరణలో రాష్ట్ర ప్రభుత్వం మాంగ్ వర్గాన్ని గ్రూప్-1 కేటగిరి నుండి గ్రూప్-2 కేటగిరికి మార్చి న్యాయం చేయాలని ఆ వర్గానికి చెందిన నాయకులు ఆర్డీఓ లోకేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్థితిగతులు, వృత్తి విధానం సమానంగా ఉంటుందని, చెప్పులు కుట్టడం, డప్పులు కొట్టడం లాంటివి తమ కులవృత్తిగా ఉన్నాయన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణలో ఎస్సీల్లో అభివృద్ధి చెందిన వర్గాలైన గ్రూప్-ఏ వర్గంలో తమను వేయడం రానున్న రోజుల్లో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ వర్గాన్ని గ్రూప్-బిలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, నవనాథ్, నీలకంఠ, సురేష్, అశోక్, బాబు, శ్రీకాంత్, సాగర్, రోహిదాస్ పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలను అందజేసిన రిటైర్డ్ జీఎం దంపతులు



నవతెలంగాణ-రెబ్బెన

గోలేటి శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో ఉన్న శివాలయానికి ఉత్సవ విగ్రహాలను రిటైర్డ్ జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి దంపతులు అందజేశారు. గోలేటిలో ఎన్నో సంవత్సరాలు గోలేటి-1 మేనేజర్‌గా సేవలు అందించడం జరిగిందని ఆయన అన్నారు. కార్మికులు, అధికారులు, ప్రజలతో సంబంధాలు ఎంతో మెరుగుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గోలేటి జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ గోలేటి కోదండ రామాలయం ప్రాంగణంలో ఉన్న శివాలయానికి ఉత్సవ విగ్రహాల అందజేయడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి సంగం ప్రకాష్ రావు, కమిటీ సభ్యులు మారం శ్రీనివాస్, దుర్గం తిరుపతి, పంపాల శ్రీనివాస్, పరికిపండ్ల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవి కాల ప్రణాళికతో పాటు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు నేపథ్యంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌తో పాటు గ్రామపంచాయతీ పరిధిలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపియడం జరుగుతుందని, వినియోగదారుల సహకరించాలని కోరారు.

పరిషత్, పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ల జాబితా



నవతెలంగాణ-హాజీపూర్

మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం రెండవ సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పురస్కరించుకుని ఎంపీటీసీల వారీగా ఓటర్ల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. ఎంపీపీపీ కార్యాలయ సిబ్బంది ఎంపీటీసీ ఓటర్ల జాబితాను ప్రదర్శనగా ఉంచుతూ పంచాయతీ ఓటర్ల జాబితా మేరకు ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు. అలాగే మండలంలోని 12 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనూ కార్యదర్శులు ఓటర్ల జాబితాల ప్రదర్శనగా ఉంచారు.

నామినేషన్‌లో పాల్గొన్న కంది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్-నిజామాబాద్-కరీంనగర్-మెదక్ జిల్లాల కాంగ్రెస్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, విప్ ఆది శ్రీనివాస్‌లను కలిసి పలు విషయాలపై చర్చించారు. వారిని కంది శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కంది శ్రీనివాస రెడ్డిని శాలువాతో సత్కరించారు. నామినేషన్ కార్యక్రమం అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క నేతృత్వంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించే తహసీల్దార్లపై చర్యలు : కలెక్టర్

- రేషన్ కార్డు డేటా ఎంట్రీ రెండు రోజుల్లో పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం పూర్తి వివరాలను డేటా ఎంట్రీ ద్వారా రెండురోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కొన్నిచోట్ల డేటా ఎంట్రీ చాలా నెమ్మదిగా కొనసాగడం నిర్లక్ష్యం వహిస్తున్న సంబంధిత తహసీల్దర్‌పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రేషన్ కార్డు డేటా ఎంట్రీ, ఇందిరమ్మ ఇళ్ళు, పైలెట్ ప్రజావాణి బహిరంగ విచారణలపై సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 26న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో స్వీకరించిన అర్జీలను తప్పులు దొర్లకుండా డేటా ఎంట్రీ ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. మొత్తం 41080 రేషన్ కార్డులు కొత్తవి, పాతవి కలిపి ఇందులో 13149 న్యూ రేషన్ కార్డ్స్ డేటా ఎంట్రీ పూర్తి, 4830 మెంబర్ ఎడిషన్ డేటా ఎంట్రీ చేయడం జరిగిందని ఇప్పటి వరకు 43 శాతం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. అనుభవం గల ఆపరేటర్లు, పంచాయితీ సెక్రటరీలను నియమించుకుని డేటా ఎంట్రీ వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే తహసీల్దార్లపై శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పైలట్ ప్రజావాణిలో భాగంగా గాదిగూడ, నార్నూర్, తాంసీ, ఇచ్చోడ, సిరికొండ, గుడిహత్నూర్‌లలో రేపు జరగనున్న బహిరంగ విచారణ మొదటిసారిగా మన జిల్లాలో మండల స్థాయిలో ప్రారంభమైన పైలెట్ ప్రజావాణి మంగళవారం కూడా నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా ఫిర్యాదుదారుల నుండి సంభందిత అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించి తక్షణ పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, తదితర ప్రాంతాలలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్, ఎంపీడీఓ పాల్గొన్నారు.

మున్సిపాల్టీల్లో పన్ను వసూళ్లను పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నవతెలంగాణ-నిర్మల్



మున్సిపాలిటీలలో పన్ను వసూలును త్వరితగతిన పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలలో ఆస్తి, వాణిజ్య, నీటి, వ్యాపార ప్రకటనల పన్నుల వసూలును వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పన్ను వసూలు లక్ష్యం, ఇప్పటి వరకు పూర్తి చేసిన వసూలు వివరాలను మున్సిపాలిటీల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధిక మొత్తంలో పన్ను చెల్లించని వారి జాబితాను సిద్ధం చేసి నోటీసులను జారీ చేయాలన్నారు. ప్రభుత్వ వాణిజ్య సముదాయాల అద్దెలు వసూలు చేయాలన్నారు. వాణిజ్య లైసెన్సుల పునరుద్ధరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీల పరిధిలో పెంచుతున్న నర్సరీలకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. పట్టణాల్లో అనుమతి లేకుండా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే జరిమానాలు విధించాలని, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలనుకున్న వారు ముందస్తుగా మున్సిపల్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలాన్నారు. ఈ సమావేశంలో నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, జాదవ్‌కృష్ణ, రాజేష్ కుమార్, సానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు, డీఈలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-తలమడుగు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని నందిగామ గ్రామంలో కొత్తగా నిర్మించిన నంది శివాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. విగ్రహ ప్రతిష్టాపన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందిగామ గ్రామస్తులు ఎమ్మెల్యేకు గిరిజన సాంప్రదాయ ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన యజ్ఞంలో మాజీ డీసీసీబీ చైర్మెన్ దామోదర్‌రెడ్డి, వైద్యులు శేఖర్‌రెడ్డి దంపతులు, భూషణ్‌రెడ్డి దంపతులు, యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త ముడుపు ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, కిరణ్ కుమార్, కేదారేశ్వర్‌రెడ్డి, మహేష్ దేశ్‌ముఖ్, ఆశన్న యాదవ్, అభిరామిరెడ్డి, కంది నర్సింలు, రమేష్, నిమ్మల సుదర్శన్‌రెడ్డి, మాడూరి మల్లేష్, వివిధ మండలాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-బేల



గ్రామీణ స్థాయిలో ప్రతిభ ఉన్న గుర్తింపులేని క్రీడాకారులు ఎందరో మంది ఉన్నారని వారు అవకాశాలు వచ్చినప్పుడు క్రీడల్లో రాణించాలని ఎస్సై దివ్యభారతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దహేగావ్ గ్రామంలో తిరంగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, శారీరకధారుడ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారులకు ఎంతో ప్రతిభ ఉన్న వారికి ప్రోత్సాహం లేక వెనకబడి పోతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో యువ క్రీడాకారులకు గుర్తింపు ఉంటుందని ఆ దిశగా యువకులు ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మాజీ సర్పంచ్ రూప్‌రావు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు విఠల్ దేవుతాడే, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు రూపేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్ వాంఖడే, కన్య రాజు, బోక్రే శంకర్ పాల్గొన్నారు.

ఐటీ టవర్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- చీఫ్ సెక్రటరీకి మాజీ మంత్రి వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఐటీ టవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీమంత్రి జోగురామన్న కోరారు. ఈ విషయమై సోమవారం హైదరాబాద్‌లో ఇండస్ట్రీ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీని కలిసి వినతిపత్రం అందించారు. ఐటీ టవర్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఐటీ కార్యకలాపాలు ప్రారంభించిన కంపెనీలు అద్దె భవనాల్లో అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. వెంటనే ఐటీ టవర్ నిర్మాణ పనులు పూర్తి చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే ఐటీ టవర్ ద్వారా జిల్లా యువతీ యువకులు వేలాది ఉద్యోగాలు పొందవచ్చని, సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా ఆదిలాబాద్‌లోనే ఐటీ టవర్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఐటీ టవర్ ద్వారా వేలాది సంఖ్యలో విద్యార్థులు సొంత జిల్లాలోనే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ఐటీ టవర్‌కు పెండింగ్ పనులను పూర్తి చేసి దిశగా కృషి చేయాలని, విద్యార్థి భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనం పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా సమీపంలో అనుమతులు లేకుండా బొలేరో వాహనంలో టీఎస్ 18 టి 8369 మహారాష్ట్రలోని గడ్‌చందుర్ వైపు నుంచి నిజామాబాద్‌లోని సతాపూర్ మార్కెట్‌లో విక్రయించేందుకు 10 ఆవులు, రెండు దూడలు మొత్తం 12 పశువులను తరలిస్తున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎస్ఐ ప్రశాంత్ పోలీస్ సిబ్బందితో కలసి పట్టుకున్నారు. వారి వద్ద పశువులకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో అక్రమంగా రవాణ చేస్తున్న డ్రైవర్ అమీన్ షేక్, వ్యాపారి షారూక్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్టు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రధానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఆదిలాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్ డిస్ట్రిక్ట్ షెటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. కాగా స్పాన్సర్లుగా మొదటి బహుమతి శ్రీకృష్ణ హాస్పిటల్ డాక్టర్ క్రాంతి కుమార్, రెండో బహుమతి తహసీల్దార్ రామచందర్, మూడో బహుమతి బాలూరి గోవర్ధన్ రెడ్డి, నాలుగో బహుమతి ఆదిత్య ఖండేష్కర్ ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో మొదటి బహుమతి విజేత గౌతం అండ్ మహేష్, హైదరాబాద్ జట్టు, రెండో బహుమతి ఆదిలాబాద్ జట్టు దేవరావు అండ్ రమణ, మూడవ బహుమతి హైదరాబాద్ జట్టు భీంరావు అండ్ ధన్విన్, నాలుగో బహుమతి ధనుంజయ్ అండ్ శ్రీనివాస్ గెలుపొందారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చందు, శంకర్, చిన్నయ్య, అభి, సుదర్శన్, శేఖర్, రాంకుమార్, పెంటన్న, నవీన్ పాల్గొన్నారు.

ముజ్గి మల్లన్న దేవుని జాతరకు ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని ముజ్గి గ్రామంలోని మల్లన్న దేవుని జాతరకు ఏర్పాట్లు పూర్తియ్యాయని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 11న మంగళవారం ఉదయం 10 గంటలకు పందిరి కార్యక్రమం, రాత్రి 10 గంటలకు మల్లన్న దేవుని కళ్యాణం ఉంటుందని, 12న బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు చల్ల కుండలు, సాయంత్రం 6 గంటలకు ఊరు చల్ల కుండలు, రాత్రి ఒగ్గు కథల కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

హనుమాన్ మందిరంలో ధ్వజ స్తంభం ఏర్పాటు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని తాండ్ర(జి) గ్రామంలో సోమవారం హనుమాన్ మందిరం ధ్వజ స్తంభం ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ గ్రామ ప్రజలు యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ దళారు మునీమ్‌ల సంఘం సోమవారం మార్కెట్ యార్డులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యార్డుకు వచ్చిన రైతులకు భోజన సౌకర్యాం కల్పించారు. రైతులు సుఖ సంతోషాలతో పాడి పంటలు పండాలని కాంక్షిస్తు ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అన్నదాన కార్యక్రమ చేపట్టారు. సమీపంలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేసి బ్యాండ్ మేళా మధ్య మార్కెట్‌కు వచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రఫుల్ యాదవ్, కొమురయ్య, ఆశన్న, గంగారాం, పోశెట్టి, సురేష్, విఠల్, సంజయ్, రమేష్ ఉన్నారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు బంద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల ఆధార్ వెరిఫికేషన్లో పలు సాంకేతిక సమస్యల రీత్యా కొనుగోళ్లు నిలిపివేసినట్లు వెల్లడించారు. రైతు సోదరులు గమనించి పత్తిని మార్కెట్ యార్డ్‌కు పత్తి తీసుకరావద్దని తెలిపారు. తిరిగి ఆధార్ సర్వర్ పునరుద్ధరణ తరువాత ఎప్పుడు పత్తి కొనుగోళ్ళు చేపడుతామో తేదీలను ప్రకటిస్తామన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.